

- మరో హామీని నెరవేర్చిన సీఎం చంద్రబాబు
- జిల్లా వ్యాప్తంగా ఆటో ర్యాలీలు.. భారీ సభలు
- మెగా చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు
- బుక్కరాయసముద్రంలో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్



రాంనగర్ బ్రిడ్జిపై ఆటో డ్రైవర్ల ర్యాలీ

ఆటోవాలా.. ఆనందం..!



మిన్నంటిన ఆటో డ్రైవర్ల సంబరం.. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 వేలు జమ

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 వేల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం శనివారం జమ చేసింది. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో హామీ 'ఆటో డ్రైవర్ల సేవలో' అమలు కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు చిత్రపటాలను చేతబట్టుకుని ఆటో ర్యాలీలు నిర్వహించారు. టీడీపీ కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు ఈ వేడుకలలో భాగస్వాములయ్యారు.







● బుక్కరాయసముద్రంలో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని కలెక్టర్ ఆనంద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రారంభించారు. ఏడీసీసీబీ చైర్మన్ మంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, పార్టీ నాయకులు పసుపుల శ్రీరామ్‌రెడ్డి, ఎంపీపీ సునీత, టీడీపీ నేతలు రవీంద్ర, ఓబుళపతి, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ముసలమ్మకట్ట వద్ద నుంచి ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు.



● రాయదుర్గం తేరు బజార్ వద్ద ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతకు మునుపు బళ్లారి రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి తేరు బజార్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు.

● అనంతపురంలో టీడీపీ అర్బన్ కార్యాలయం నుంచి రాంనగర్, ప్రభుత్వ ఆస్పత్రి, తెలుగుతల్లి కూడలి మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వయంగా ఆటో నడిపి ఆనందంలో పాలు పంచుకున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, రవాణా శాఖ అధికారి సురేష్ నాయుడు, మున్సిపల్ కార్పొరేషన్ ఏసీ పావని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది చంద్రన్న భరోసా

కూటమి వచ్చాకనే సంక్షేమం

ఆటో డ్రైవర్ల సేవలో.. సభలలో కలెక్టర్లు, ఎమ్మెల్యేలు

(ప్రసంగ వివరాలు 7లో..)

● అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే, స్వయంగా కాసేపు ఆటో నడిపారు. ఆటో డైవర్లు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అక్కంపల్లి పంచాయతీలోని ఎన్ఆర్ కాలనీ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం నిర్వహించిన సభలో నియోజకవర్గ పరిధిలోని 1,752 మందికి రూ.2.63 కోట్ల మెగా చెక్కును అందజేశారు.



● కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆటో నడుపుతూ, ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

● పాత గుంతకల్లు బీరప్ప సర్కిల్ వద్ద ఆటో ర్యాలీని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. మార్కెట్ యార్డు వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ నిర్వహించిన సభలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, మణి కంఠ, బండారు ఆనంద్, కృష్ణారెడ్డి, మ స్తాన్ యాదవ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



త్వరలో కొత్త ఫైర్ వాహనాలు

● ఫైర్ డీజీ వెంకటరమణ

అనంతపురం క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా అగ్నిమాపకశాఖకు త్వరలో కొత్త వాహనాలు రానున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక సేవల విభాగం డైరెక్టర్ జనరల్ వెంకటరమణ తెలిపారు. జేఎన్టీయూలో జోన్ -4 అధికారులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50 ఏళ్లు పైబడిన ఫైర్ వాహనాలు 120 వరకూ ఉన్నాయని, ఇటీవల కొత్త బడ్జెట్ వచ్చిందని, ఆ నిధులతో త్వరలో కొత్త వాహనాలు తెస్తామన్నారు. జోన్ -4 పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అగ్నిమాపక వాహనాల పరిస్థితి, వాటి బలోపేతంపై సమీక్ష చేశారు. సిబ్బంది పనితీరు, కొత్త సాంకేతిక పరికరాల అవసరం, అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళిక తదితర అంశాలపై ప్రాంతీయ అగ్నిమాపకశాఖాధికారి భూపాల్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. పలు ప్రాంతాలకు 17 కొత్త ఫైర్ స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. నిర్మాణ దశలో ఉన్న వాటిని సైతం పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు విపత్తులపై ప్రత్యేక దృష్టి పెడతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీజీ వెంకటరమణ

25 దాకా ఈ పంట నమోదు

అనంతపురం అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో ఈ పంట నమోదు గడువును ఈనెల 25వతేదీ దాకా పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత సెప్టెంబరు నెలాఖరు దాకా ఈ పంట నమోదుకు గడువు ఉండగా క్షేత్ర స్థాయిలో మందకొడిగా సాగుతుండటంతో గడువు పొడిగిం చారు. జిల్లా వ్యాప్తంగా 1901538 ఎకరాల్లో (పంట సాగు చేసిన పొలం, బీడు భూములు) ఈ పంట నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి దాకా 8 లక్షల ఎకరాల్లో (42శాతం)నే పూర్తి చేశారు.

జిల్లాకు యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కోరమాండల్ కంపెనీకి చెందిన 1009.49 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను ఆయన పరిశీలించారు. జేసీ ఆదేశాల మేరకు... ఏపీ మార్క్‌ఫెడ్‌కు 520, ప్రైవేటు డీలర్లు, మనగ్రోమోర్‌కు 489.49 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు తెలిపారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ఈనెల 6న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

వజ్రాల కోసమే చోరీ

● నంది విగ్రహం అపహరణ కేసు ఛేదింపు
● నలుగురు గుప్త నిధుల వేటగాళ్ల అరెస్టు



ధ్వంసమైన నందివిగ్రహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నంది విగ్రహం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, ధ్వంసమైన నంది విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఈ కేసు వివరాలను విలేకరులకు శనివారం వెల్లడించారు. ముష్టికోవెల శివారులో ఉన్న పురాతన శివాలయంలో గత నెల 4న నందివిగ్రహం చోరీ అయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పావగడలో సీసీ ఫుటేజీ, కాల్‌డేటా ఆధారంగా నిందితులను గుర్తించారు. నంది విగ్రహంలో వజ్రాలు ఉన్నాయనే అనుమానంతో చోరీ చేసినట్లు తేల్చారు. అర్ధరాత్రి విగ్రహాన్ని చోరీ చేసి, బొలెరోలో తీసుకెళ్లారని, పావగడ తాలూకా వీర్లగూడి గ్రామ సమీపంలో నంది విగ్రహాన్ని ధ్వంసం చేశారని డీఎస్పీ తెలిపారు. వజ్రాలు లేకపోవడంతో విగ్రహాన్ని ఒక పాడుబడిన బావిలో పడేశారని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పోలీసులు ధ్వంసమైన నంది విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మధుగిరి తాలూకా తుముకూరు జిల్లా బడవహనహళ్లికి చెందిన మధుసూదన్, దీపక్ శెట్టి, చిత్రదుర్గ జిల్లా తుమకూర్లుహళ్లికి చెందిన భానుప్రసాద్, సి.హరివే ప్రాంద్రాకు చెందిన చందన్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు నాగేంద్ర సహా మిగిలినవారిని త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ, ట్రైనీ ఎస్ఐ గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలే టార్గెట్..!

● ఏపీ, కర్ణాటకలో చోరీలు
● అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
● రూ.22 లక్షల ఆభరణాలు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో చోరీ చేసే ముఠాను కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఏపీ, కర్ణాటకలోని 18 ఆలయాల్లో ఈ ముఠా చోరీలు చేసినట్లు గుర్తించారు. ముఠా నుంచి రూ.22 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రాగి, ఇత్తడి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు వివరాలను కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబుతో కలిసి ఎస్పీ జగదీష్ వివరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శెట్టూరు మండలం మాకొడికి గ్రామానికి చెందిన మద్రిస్వామి అలియాస్ సంగీత(45), రాజు(37), శెట్టూరుకు చెందిన ముచ్చర్లపల్లి శ్రీనివాసులు(49) స్నేహితులు. వ్యసనాలకు బానిసలయ్యారు. డబ్బు కోసం ఆలయాలు, ఊళ్లకు దూరంగా ఉండే ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడేవారని తెలిపారు.

ఇక్కడంతా చోరీలు..

శెట్టూరు మండలం పర్లచేడు తాటి మారెమ్మ ఆలయం, చింతర్లపల్లి ఆంజనేయస్వామి ఆలయం, కుందుర్పి మండలం బెస్తరపల్లిలోని సవారమ్మ దేవాలయం, యర్రగుంలోని మారెమ్మ ఆలయం, కంబదూరు మండలంలోని కొత్తమిద్దెల పెద్దమ్మ ఆలయం, రాంపురం మారెమ్మ ఆలయం, కొత్తూరు నరసింహస్వామి ఆలయం, అండేపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, వైసీ పల్లి గౌడ చంద్రమ్మ ఆలయం, కొగరబండ తిమ్మప్ప దేవాలయం, కళ్యాణదుర్గం మండలం కదరంపల్లి పోలేరమ్మ ఆలయం, గోళ్లలోని మారెమ్మ ఆలయం, బోరంపల్లిలోని సుంకులమ్మ, మారెమ్మ ఆలయాలు, కళ్యాణదుర్గం అక్కమాంబ ఆలయం, బెళుగుప్ప (మిగతా 7లో...)



నిందితులను చూపుతున్న ఎస్పీ జగదీష్, పోలీసులు అధికారులు

చంద్రబాబు చిత్తశుద్ధి..



చెక్కును చూపుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ఆటో డ్రైవర్ల సేవలో.. పథకం సీఎం చంద్రబాబుకు బడుగుల అభ్యున్నతి పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం పేదల పక్షం వహిస్తుంది. ఉచిత బస్సు పథకం కారణంగా ఆటోవాలాలు నష్టపోకూడదనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని అందించడం హర్షించదగ్గ విషయం. నియోజకవర్గంలో లబ్ధిదారులకు రూ.2.59 కోట్లు అందింది.

- గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే

ఇది చంద్రన్న భరోసా

కూటమి వచ్చాకనే సంక్షేమం...

మీకు అండగా నిలవాలనే..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కొంద ఆదాయం తగ్గింది. వారికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గుర్తించి, డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టితో ఉంచుకుని ప్రభుత్వం వారికి ఆర్థికంగా అండగా నిలబడుతోంది. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ద్వారా రాష్ట్ర పునర్నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఆటో డ్రైవర్లు ఈ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి.

- ఆనంద్, కలెక్టర్, అనంతపురం జిల్లా



చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, నాయకులు

ఆటో డ్రైవర్ల సేవలో.. ఎమ్మెల్యేలు, నాయకులు

సద్వినియోగం చేసుకోండి...

టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. అందులో భాగంగానే 'ఆటో డ్రైవర్ సేవలో' పథకాన్ని ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మీ కష్టాలను అర్థం చేసుకుని, మీకు అండగా నిలుస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. అర్హుల బ్యాంకు ఖాతాల్లో ఈ సొమ్ము జమ అవుతోంది. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- బండారు శ్రావణిశ్రీ, శింగనమల ఎమ్మెల్యే

లైసెన్స్‌కు డబ్బులిస్తా..



కళ్యాణదుర్గంలో మెగా చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

టీడీపీ కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల ఖాతాలో రూ.15 వేలు చొప్పున జమ చేసింది. నియోజకవర్గంలో 323 మందికి లబ్ధి చేకూరింది. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోండి. ఆర్థిక ఇబ్బందులు ఉంటే ఆ డబ్బును నేనే ఇస్తాను. వైసీపీ పాలనతో ఆటో డ్రైవర్లను ఆదుకోలేదు. పైగా గుంతల రహదారులతో ఇబ్బంది పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సమస్యలన్నీ తీరాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోంది.

- అమిలినేని సురేంద్ర బాబు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే

వైసీపీ హయాంలో దోచేశారు..



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

పేదలు సంతోషంగా ఉండాలన్నదే చంద్రన్న ఆకాంక్ష. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఆటో డ్రైవర్లకు అండగా నిలిచారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చే మీకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. వైసీపీ హయాంలో రోడ్లన్నీ గుంతలు పడ్డాయి. పన్నులు పెంచి డ్రైవర్లను ఇబ్బంది పెట్టారు. రూ.10 వేలు ఇచ్చి పన్ను రూపంలో కాజేశారు. చంద్రబాబు సీఎం కాగానే ఆ సమస్యలన్నీ తీరాయి. త్వరలో స్పెషల్ డ్రైవ్ పెట్టి ఆటో డ్రైవర్లుకు లైసెన్స్, ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ చేయిస్తాం. అప్పుడే ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు భద్రత ఉంటుంది.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

పేదింట వెలుగులు



ఆటో డ్రైవర్లతో కలిసి చెక్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కాలవ

ఆటో కార్మికులకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. జగన్ హయాంలో 2.65 లక్షల మందికి ఏడాదికి రూ.265 కోట్లు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం మూడు లక్షల మందికి రూ.436 కోట్లు ఇచ్చింది. కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్న పేద కుటుంబాల్లో వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారు. వీలైనంత ఎక్కువమందికి సాయం అందేలా నిర్ణయం తీసుకున్నారు.

- కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే

లైసెన్స్ తీసుకోండి..



చెక్కును ఆటో డ్రైవర్లకు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వైసీపీ ప్రభుత్వంలో అప్పులు చేసి రాష్ట్రాన్ని కష్టాలోకి నెట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఆ కష్టాల నుంచి గట్టెక్కిస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారు. నియోజకవర్గంలో 1,752 మంది ఆటో డ్రైవర్లకు రూ.2.63 కోట్ల లబ్ధి చేకూరింది. ఆటో డ్రైవర్లు చాలా కష్టపడతారు. వారికి లైసెన్స్ లేకపోవడంతో నష్టపోతున్నారు. అందుకే లైసెన్స్ లేకుంటే ఈ పథకం వర్తించదనే నిబంధన పెట్టారు. అందరూ లైసెన్స్ తీసుకోండి. జాగ్రత్తగా ఆటోను నడపండి. మీరు బాగుండాలన్న ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నాను.

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

సీఎం చెప్పారు.. చేశారు



నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభలో దసరా కానుకగా ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చినమాట నిలబెట్టుకున్నారు. అనంతపురం అర్బన్‌లో 1,137 మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూరింది. ప్రతి సంవత్సరం ఈ పథకాన్ని అమలు చేస్తాం. వైసీపీ హయాంలో కొందరికి మాత్రమే.. అదీ రూ.10 వేల సాయం అందించారు. కూటమి ప్రభుత్వం అర్హులందరికీ లబ్ధి చేకూర్చింది.

- దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

జనం కష్టాలు చూశారు..



మెగాచెక్కును అందజేస్తున్న పరిటాల శ్రీరామ్, చిలకం మధు, సందిరెడ్డి, జీఎం శేఖర్, హరీశ్‌బాబు, ఆర్డీఓ మహేశ్, ఆర్టీఓ రాణి

సీఎం చంద్రబాబు ప్రజల కష్టాలను చూశారు. అందుకే ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారు. అధికారంలోకి రాగానే వాటిని అమలు చేశారు. ఆటో డ్రైవర్లు పడుతున్న కష్టాన్ని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ స్వయంగా చూశారు. వారికోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎన్నికల నామినేషన్ సమయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ర్యాలీకి భారీగా జనం వచ్చారు. ఆయన వాహనం ఇరుక్కుపోవడంతో ఆటోలో వెళ్లి నామినేషన్ వేశారు.

- పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్ రెడ్డి, ధర్మవరం నేతలు

రజనీ స్టైల్..



చెక్కును పంపిణీ చేస్తున్న జేసీపీఆర్

తాడిపత్రిలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఆటో డ్రైవర్ యూనిఫాం వేసుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. రజనీకాంత్ తరహాలో 'బాషా' సినిమా డైలాగులు చెప్పి ఆకర్షించారు. నియోజకవర్గంలో 1614 మందికి రూ.2.42 కోట్ల లబ్ధి చూకూరిందని తెలిపారు. పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్ద సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లతో కలెక్టర్, ఎమ్మెల్యే, నాయకులు

ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా జిల్లాలో 5,720 మంది లబ్ధి పొందారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.15 వేలను ప్రతి ఆటో డ్రైవర్ సద్వినియోగం చేసుకోవాలి. మీరు కష్టజీవులు. ఈ విషాయాన్ని గుర్తించి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వచ్చిన సొమ్ముతో వాహనాలకు మరమ్మతు, బీమా చేయించండి. అప్పుడే మీకు, ప్రయాణికులకు భద్రత ఉంటుంది.

- శ్యాంప్రసాద్, కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా

ఆటో కార్మికులకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరింది. నియోజకవర్గంలో 1,122 మందికి రూ.1.68 కోట్ల లబ్ధి చేకూరింది. లైసెన్సులు లేనివారికి మా డబ్బుతో లైసెన్స్ ఇప్పిస్తాం. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించండి. డ్రైవింగ్‌లో నిబంధనలు పాటించండి.

- పల్లె సింధూరా రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

ఆలయాలే టార్గెట్..!

(5వ పేజీ తరువాయి)

మండలం యలగలవంకలోని గౌసంద్ర మారెమ్మ ఆలయం, గంగవరంలోని మారెమ్మ ఆలయం, గంగవరం-విరుపాపల్లి గ్రామాల మధ్య ఉన్న సుంకులమ్మ ఆలయాల్లో చోరీలు చేశారు. దేవుళ్ల, దేవతల విగ్రహాలకు అలంకరించిన ఆభరణాలు, రాగి, ఇత్తడి వస్తువులను చోరీ చేశారు. కళ్యాణదుర్గం పట్టణం, మండలంలోని దాసంపల్లిలోని రెండు ఇళ్లలో బంగారం ఆభరణాలను తస్కరించారు.

పక్క రాష్ట్రంలోనూ కేసులు

నిందితులపై కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా హిరియూరు, అబ్బినహోల్, చెళ్లికేర పట్టణంలో చోరీ కేసులు ఉన్నాయి. కళ్యాణదుర్గం డీఎస్పీ రవి బాబు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం రూరల్, అప్‌గ్రేడ్ స్టేషన్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వీరిని అరెస్టు చేశారు. మొత్తం 44 గ్రాముల బంగారం ఆభరణాలు, 12.350 కిలోల వెండి ఆభరణాలు, వస్తువులు, 20 కిలోల ఇత్తడి గంటలు, 5 కిలోల రాగి బిందెలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర పోషించిన సీఐలు నీలకంఠేశ్వర, వంశీకృష్ణ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఎదురెదురుగా కార్లు ఢీ

దంపతుల మృతి.. ఐదుగురికి గాయాలు

విడపనకల్లులో రోడ్డు ప్రమాదం

విడపనకల్లు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద బళ్లారి-అనంతపురం 42వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. విడపనకల్లు పోలీసులు తెలిపిన మేరకు విశాఖపట్నానికి చెందిన సుధీర్(35) కియ కంపెనీలో విధులు నిర్వహిస్తు అనంతపురంలో కాపురం ఉంటున్నాడు. సుధీర్ తన భార్య లావణ్య(30), కుమారుడు ఉదయ్‌తో కలిసి కారులో శనివారం అనంతపురం నుంచి హంపికి బయల్దేరాడు. అనంతపురానికి చెందిన నలుగురు స్నేహితులు శ్రీనివాసులు, సంజీవరెడ్డి, నాగిరెడ్డి, వెంకటప్పనాయుడు గోవాకు వెళ్లి అనంతపురం తిరిగి వస్తున్నారు. విడపనకల్లు పెట్రోల్ బంక్ వద్దకు రాగానే రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రెండు కార్ల ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. రెండు కార్లలో ఉన్న ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. విడపనకల్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లావణ్య మృతి చెందారు. మిగిలిన ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ సుధీర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన వారి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. అయితే ఏ కారు మరో కారును ఢీ కొట్టిందో స్పష్టత లేదని వారు పేర్కొన్నారు. విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆయాల గొడవ.. ఆకలితో పసికందు మృతి

శిశుగృహలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కట్టుకథలతో పక్కదారి పట్టించే యత్నం

అనంతపురం వైద్యం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఆయాల మధ్య గొడవ రెండు నెలల పసిగుడ్డు ప్రాణం తీసింది. నగరంలోని శిశుగృహలో ఆరు రోజులుగా ఆ ఇద్దరు ఆయాలు తమ డ్యూటీల గొడవలలో మునిగి పోయారేగానీ ఆ చిన్నారి ఆకలి కేకలు పట్టించుకోలేదు. దీంతో ఆ చిన్నారి అనారోగ్యానికి గురైంది. గురువారం అర్ధరాత్రి ఉలుకు పలుకు లేకపోవడంతో ఆ రోజు విధుల్లో ఉన్న ఆయా ఆ చిన్నారిని అర్ధరాత్రి 12 గంటల సమయంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లింది. అయితే అప్పటికే ఆ చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. ఈ విషయం శిశుగృహ సెంటర్ మేనేజర్, నర్సులకు తెలపడంతో గుట్టుచప్పుడు కాకుండా ఆ చిన్నారి విరేచనాలతో మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించారని ఓ కట్టుకథతో ఐసీడీఎస్ పీడీకి ఫైలు పంపారు. అదే సమాచారాన్ని కలెక్టర్‌కు పంపారు. అయితే ఏమనుకున్నారో ఏమో గానీ ఆ శిశు గృహ మేనేజర్, నర్సు, సంబంధిత ఆయాలు చిన్నారిని ఖననం చేసే ముందు... చేయకముందు ఫొటోలు తీశారు. ఆ ఫొటోలతోనే డెత్ బిఫోర్... డెత్ ఆఫ్టర్ అంటూ అందర్నీ మాయ చేశారు. కథ సుఖాంతమైందనుకున్న తరుణంలో ఓ వర్కర్ చేసిన పనితో గుట్టు రట్టు అయ్యింది. దీంతో శనివారం అసలు కథ బయటికొచ్చింది. ఇదే విషయంపై ఐసీడీఎస్ పీడీని, శిశుగృహ మేనేజర్‌ను వివరణ అడగ్గా సేమ్ టు సేమ్ డెత్ బిఫోర్ ఫోటోలు... డెత్ ఆఫ్టర్ ఫొటోలు ఉన్నాయి. వైద్యుడు నిర్ధారించారు. చిన్నారి విరేచనాలతోనే చనిపోయిందంటూ అందరూ అదే కట్టుకథను వల్లె వేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, అధికారులు ఏ మేరకు స్పందించి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



శిశువు మృతదేహాన్ని ఖననం చేస్తున్నట్లు చూపిన దృశ్యాలు

కులగణనతోనే బడుగులకు న్యాయం

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కులగణనతోనే బడుగు, బలహీన వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లాస్థాయి రౌండుటేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జనగణనలో కులగణన చేపట్టి బీసీకులాల ప్రాతిపదికన స్థానిక సంస్థల లో సీట్లు కేటాయించాలన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి కులగణన చేపట్టి, వారి ఆర్థిక పరిస్థితుల ఆధారంగా ఆయావర్గాలకు సంక్షేమ ఫలాలు వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, మాజీమేయర్ రాగే పరశురామ్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ, సీపీఐ నాయకులు జాఫర్. వేమయ్య యాదవ్, వివిధ ప్రజా సంఘాల నేతలు సాకేహరి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, ఇతర పార్టీల నేతలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బెళుగుప్ప, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యలగలవంక గ్రామానికి చెందిన రైతు పోతన్న(71) అప్పుల బాధతో శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. రైతు భార్య పార్వతి తెలిపిన మేరకు, పోతన్న కుటుంబానికి ఏడు ఎకరాల తోట ఉంది. పంటలు పండక తీవ్రంగా నష్టపోయారు. అప్పులకు వడ్డీలు పెరిగి రూ.25 లక్షలకు చేరింది. వాటిని తీర్చే మార్గం లేక పోతన్న ఆవేదన చెందేవారు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగారు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివ తెలిపారు. రైతు దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ముగ్గురు విటుల సహా నలుగురి అరెస్టు

ధర్మవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజయ్‌నగర్‌లో వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు విటులతో పాటు నిర్వాహకురాలిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పట్టణంలోని కదిరిగేటు సమీపంలోని సంజయనగర్‌లోని ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేత్రదానం



పత్రాలను అందుకుంటున్న భార్య వనజ

పెనుకొండ రూరల్, అక్టోబరు 4(ఆంధ్ర జ్యోతి): పెనుకొండ సమీపంలోని అమ్మవారిపల్లివద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నాగరాజు కళ్లను దానం చేసినట్లు ఆయన భార్య వనజ తెలిపారు. ధర్మవరం మండలం ఓబుళనాయనపల్లి గ్రామానికి చెందిన నాగరాజు కియ బస్సు డ్రవర్‌గా పని చేసేవాడు. గురువారం రాత్రి ఇంటి నుంచి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని అనంతపురం, అక్కడి నుంచి కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తన భర్త మృతి చెందినా మరొకరికి చూపు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో భర్త కళ్లను దానం చేసినట్లు భార్య తెలిపినట్లు కియ స్టేషన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు.



తపోవనం సర్కిల్లో భారీగా నిలిచిన వాహనాలు



బళ్లారి బైపాస్ సర్కిల్లో..



కళ్యాణదుర్గం బైపాస్ నుంచి డీమార్ట్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డులో ..

నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- కళ్యాణదుర్గం బైపాస్‌లో ఆగిపోయిన ట్రక్కుతో సమస్య
- బళ్లారి బైపాస్, తపోవనం సర్కిళ్లలో భారీగా నిలిచిన వాహనాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఇబ్బంది పడిన వాహనదారులు, ప్రజలు
- తరచూ ఈ సమస్య ఉంటోందని ఆవేదన

అనంతపురం క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు కూడళ్లలో తరచూ ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా శనివారం కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్, తపోవనం సర్కిళ్లలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో తీవ్ర అవస్థ పడ్డారు. కళ్యాణదుర్గం బైపాస్ సర్కిల్లో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ట్రక్కు ఉన్నఫలంగా ఆగిపోయింది. సదరు డ్రైవర్ డీజిల్ బటన్ ఆన్ చేసుకోపోవడంతో వాహనం ఆగిపోయినట్టు తెలుస్తోంది. అయితే ఏ సమస్య వల్ల ఆగిపోయిందో తెలుసుకోలేక డ్రైవర్ అవస్థలు పడ్డాడు. ఆ ట్రక్కు రోడ్డుకు అడ్డుగా నిలిచిపోవడంతో అనేక వాహనా లు ముందుకు వెళ్లలేక అలాగే నిలిచిపోయాయి. దీంతో తీవ్ర ట్రాఫిక్ సమ స్య నెలకొంది. ప్రధానంగా కళ్యాణదుర్గం బైపాస్ నుంచి డీ మార్ట్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో, బళ్లారి బైపాస్ నుంచి కళ్యాణదుర్గం బైపాస్‌కు వచ్చే రహదారిలో, బళ్లారి బైపాస్ నుంచి తపోవనంకు వెళ్లే సర్వీస్ రోడ్డులో, క్లాక్ టవర్ నుంచి కళ్యాణదుర్గం బైపాస్ సర్కిల్‌కు వచ్చే రోడ్డులో వందలాది



సమస్యకు కారణమైన ట్రక్కు ఇదే..

వాహనాలు ఆగిపోయాయి. కొన్ని చోట్ల ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో అవస్థలు తప్పలేదు. దసరా సెలవులు తర్వాత హైదరాబాద్, బెంగళూరు వెళ్లే జిల్లా వాసులు, ఇతర ప్రయాణికుల కార్లు భారీగా క్యూలో నిలిచిపోయాయి. ఎట్టకేలకు కొద్దిసేపటి తర్వాత కళ్యాణదుర్గం బైపాస్ సర్కిల్లో ట్రక్కు క్లియర్ అయిన తర్వాత ట్రాఫిక్ సమస్య సర్దుమణిగింది. అయితే ఈ ట్రాఫిక్ సమస్య ఈ రోజు ఒక్కటే కాదని తరచూ ఎదురవుతోందని వాహనదారులు, నగర ప్రజలు వాపోయారు.

జీఎస్టీ తగ్గింపుతో డ్రిప్ రైతులకు ఊరట

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో డ్రిప్ రైతులకు ఊరట లభించిందని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 12 శాతం జీఎస్టీ వసూలు చేసేవారని, అయితే గత నెల 22వతేదీ నుంచి 12 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీని కేంద్రం తగ్గించిందని తెలిపారు. ఈ ఏడాది జిల్లాకు 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్లు మంజూరు చేయాలని లక్ష్యాన్ని విధించారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి డ్రిప్ మంజూరైన రైతులకు కూడా తగ్గింపు జీఎస్టీని అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గత నెల 22వతేదీ వరకు జిల్లాలో 1110 మందికి డ్రిప్ పరికరాలు మంజూరు చేయడంతోపాటు పరికరాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. ఆయా రైతులకు గతంలోని 12 శాతం జీఎస్టీ అమలైందన్నారు. ప్రస్తుతం 5 శాతం తగ్గింపు జీఎస్టీని పరిగణలోకి తీసుకొని, ఆయా రైతులకు రూ.55 లక్షలు మొత్తాన్ని తిరిగి చెల్లించనున్నట్లు చెప్పారు. రైతుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అందుబాటులో 3,859 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3859 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు రైతు సేవా కేంద్రాల్లో 306 మెట్రిక్ టన్నులు, సొసైటీల్లో 131, ప్రైవేటు డీలర్ల వద్ద 1021 , హోల్ సెల్ డీలర్లు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 1713, కంపెనీ గోదాముల్లో 109 మెట్రిక్ టన్నులు యూరియా ఉందన్నారు. అదే విధంగా రవాణాలో 580 మెట్రిక్ టన్నులు యూరియా ఉన్నట్లు చెప్పారు.

నేటి నుంచి జేశాప్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ



ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేశాప్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం నుంచి జేశాప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జేశాప్ సభ్యులు తెలిపారు. ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 16జట్లు టోర్నీలో పాల్గొనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్, ఎమ్మెల్యేలు కందికుంట వెంకట ప్రసాద్, పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్, బం డారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, జేసీ అస్మిత్ రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర రెడ్డి, గుమ్మనూరు జయరాం హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జేశాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకదిరయ్య ఆలయం వద్ద అన్నదానం

రాప్తాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు గ్రామంలో వెలసిన చిన్నకదరయ్యస్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. హంపాపురం గ్రామానికి చెందిన నంబూరి రంగనాయకులు, ఈశ్వరమ్మ దంపతులు దాదాపు 500 మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మరూరు సహకార సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల గోపాల్, టీడీపీ నాయకులు కేశవ, సూరి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మరువకొమ్మ వద్ద ..

శింగనమల: మండలకేంద్రంలోని మరవకొమ్మ వద్ద అన్నదానం జరిగింది. ప్రతి శనివారం మరవకొమ్మ క్రాస్ వద్ద రుష్యశృంగముని, శ్రీరంగరాయడికి పూజలు చేసి భక్తులు దాతల సహాయంతో అన్నదానం చేపడుతున్నారు. ఈ క్రమంలో 14వ వారం కూడా కూడా కార్యక్రమాన్ని చేపట్టి బాటసారులకు అన్నదానం చేశారు. వాల్మీకి రమేష్, రామ్‌చరణ్, భక్తులు పాల్గొన్నారు.

టీఎన్ రసూల్ మృతి తీరని లోటు: సీపీఎం

అనంతపురం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు టీఎన్ రసూల్ (75) మృతి కమ్యూనిస్టులకు తీరని లోటని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం నగరంలోని తన నివాసంలో తుదిశ్వాస వదిలారు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు తదితర నాయకులు రసూల్ భౌతికకాయాన్ని సందర్శించి, సీపీఎం జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. అనంతపురం నగరంలో సీపీఎం శాఖ ఏర్పడినపుడు రసూల్ సభ్యుడిగా ఉండి పార్టీకి అనేక సేవలందించారని తెలిపారు. పార్టీ కార్యకలాపాలకు ఆయన సైకిల్ షాపే కేంద్రంగా ఉండేదన్నారు. అక్షరాస్యత ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఓబులు మాట్లాడుతూ.. రసూల్ తన తుదిశ్వాస వరకూ కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి పేద ప్రజలకోసం అనేక ఆందోళనలు నిర్వహించారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు శివారెడ్డి, సిద్దేశ్వర, ముబారక్, డాక్టర్ ప్రసూన, వీరభద్రయ్య, ప్రకాష్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రసూల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పోలీస్ స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు



అనంతపురం రూరల్ డీఎస్పీ ఆఫీస్‌లో పలు వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): రాప్తాడులోని అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయాన్ని, నార్పల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ శనివారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా తొలుత అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ డివిజన్ పరిధిలో నమోదైన కేసులు, వాటి రికవరీ, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిపై ఆరా తీశారు. చోరీ కేసుల్లో రికవరీ పెంచాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ కేసులు, పోక్సో కేసులపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అదేవిధంగా డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై కూడా చైతన్యం తేవాలని తెలిపారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌పై గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. తర్వాత నార్పల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతలపై ఆరా తీశారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీ అధికారులతో సమావేశం..

నగరంలోని డీపీఓలో ఎస్పీ జగదీష్ శనివారం మధ్యాహ్నం స్పెషల్ బ్రాంచ్ పోలీసు అధికారులు, ప్రొబేషన్ ఎస్ఐలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మట్కా, పేకాట, నిషేధిత మత్తు పదార్థాల అమ్మకాలు, ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. జిల్లాలో ఫ్యాక్షన్, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఫీల్డ్ డ్యూటీకి వెళ్లే ఎస్బీ సిబ్బందికి బూట్లు అందజేశారు. సీఐలు ధరణీకిశోర్, క్రాంతి కుమార్, ఎస్ఐలు వెంకటక్రిష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

అనంతపురం క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం జన చైతన్యకాలనీకి చెందిన 19 ఏళ్ల షేక్ ఇలియాజ్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఎర్రనేల కొట్టాల హెచ్చెల్సీ కాలువ వద్ద శవమై కనిపించాడు. అయితే యువకుడి కాలర్ బోన్ వద్ద, తలపైన, కుడి మోకాలు వద్ద, ఎడమకాలిపై గాయాలయ్యాయి. మృతుడి తల్లి షేక్ నూర్జహాన్ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. షేక్ నూర్జహాన్ భర్త బషీర్ 2021లో కరోనాతో మరణించాడు. ఆమెకు షేక్ రిజ్వానా , షేక్ ఇలియాజ్ (19) సంతానం. భర్త మరణించిన తర్వాత స్థానికంగానే చిల్లర అంగడి నడుపుతోంది. ఆమె తమ్ముళ్లు పాతూరులో పూల వ్యాపారం చేస్తుండగా, కుమారుడు ఇలియాజ్ వాళ్ల వద్ద పని చేసేవాడు. అయితే అతను గత మూణ్నెళ్లుగా మతిస్థిమితం లేని వ్యక్తిగా వ్యవహరించేవాడని తెలుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకెళ్లిన ఇలియాజ్ తర్వాత తిరిగి రాలేదు. దీంతో తల్లి, ఆమె తమ్ముళ్లు, బంధువులు పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియలేదు. శనివారం ఉదయం 6 గంటలప్పుడు కాలువ పక్కన చనిపోయి ఉన్నాడంటూ ఫోన్ రావడంతో వెళ్లి చూసి గుర్తించారు. అయితే మృతదేహంపై పలు చోట్ల గాయాలు ఉన్నాయి. మతిస్థిమితం సరిగా లేక రోడ్డుపైన పడ్డప్పుడు తగిలాయా.. లేక కాలువలో పడినప్పుడు గాయాలయ్యాయా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తన కొడుకు మృతిపై అనుమానాలున్నాయని తల్లి ఫిర్యాదు చేయడంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

నార్పల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునాలని సూచించారు. మండలంలోని దుగుమర్రి గ్రామంలో గల 12 అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత సూపర్‌వైజర్ , అంగన్‌వాడీ సిబ్బంది కలిసి పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తర్వాత సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హితమైన వస్తువులను వినియోగించాలని సూచించారు. అలాగే మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, ప్రేమలత, హెల్పర్లు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అంజలి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశానికి చాలా వరకు ప్రజాప్రతినిధులతోపాటు ప్రధానశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 11గంటలకు ప్రారంభం కాగా పలువురు ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా రావడం కనిపించింది. పలు శాఖల అధికారుల గైర్హాజరవడంతో ప్రధాన సమస్యలను లేవనెత్త లేని పరిస్థితి నెలకొంది. కొందరు అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతిని సమావేశంలో వివరించగా వాటిపై ఎటువంటి చర్చ లేకపోయింది. దీంతో సభ మొక్కుబడిగా సాగిం గైర్హాజరైన అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీడీఓ బాలకృష్ణుడు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసూన్‌కుమార్‌నాయుడు, ఏపీఓ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ పర్మిషన్ ఇప్పించాలని వినతి



వెంకటరమణను సత్కరిస్తున్న ప్రైవేట్‌స్కూళ్ల అసోసియేషన్ నాయకులు

అనంతపురంవిద్య, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న ప్రతిపాఠశాలకు నిబంధనల మేరకు సకాలంలో ఫైర్ పర్మిషన్ ఇచ్చేలా చూడాలని డెరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ వెంకటరమణను జిల్లాప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు కోరారు. వెంకటరమణ శనివారం జిల్లాకేంద్రానికి వచ్చారు. దీంతో ఆయన్ను ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రైవేట్‌స్కూళ్ల అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లకు ఫైర్ పర్మిషన్ సర్టిఫికెట్ అవసరమని, జారీచేసేలా చూడాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అపుస్మా స్టేట్‌కో ఆర్డినేటర్ కుసుమా పుల్లారెడ్డి, జిల్లాఅధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లాసెక్రటరీ రవిశంకరప్రసాద్, నాయకులు గాజులచంద్ర, మదుసూధనరెడ్డి, అన్వర్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి ప్రకటించిన అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025ను పురస్కరించుకుని స్థానిక కమలానగర్‌లో ఉన్న డీసీఎంఎస్ ఆవరణలో గల డీసీఓ కార్యాలయంలో శనివారం జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి పొదుపు, పరపతి పరస్పర సహకార సంఘాల ఏర్పాటు, సంస్థాగత నిర్మాణంపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద అల్పాదాయ వర్గాల ప్రజల జీవనోపాధుల పెంపు, పొదుపు ప్రోత్సాహించి పరపతిని అందించేందుకు జిల్లాలో విరివిగా సహకార సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 5పొదుపు-పరపతి, 21 వ్యవసాయ అనుబంధ రైతు సంఘాలను రిజిస్టర్ చేసినట్లు చెప్పారు. అనంతరం సంఘ సభ్యులకు రిజిస్టర్ సర్టిఫికెట్, బైలాను అందజేశారు. డీసీఏఓ నాగవీణ, డీపీడీఎం తేజశ్వని, సూపరిండెంట్ మునికృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై హల్‌చల్..!

- ముగ్గురు యువకులకు రిమాండ్

అనంతపురం క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్డుపై వాహనదారులను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా అమ్మాయిని వేధించిన ఘటనలో ముగ్గురు యువకులను రిమాండ్‌కు పంపినట్లు శనివారం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. హౌసింగ్ బోర్డులో గల ఎస్ఆర్ వైన్స్ దగ్గర గత శుక్రవారం ముగ్గురు యువకులు రోడ్డుపై అడ్డంగా వెళ్తూ వాహనదారులను ఇబ్బందులకు గురి చేశారు. అంతేకాకుండా ఓ యువతితో గొడవపడి వేధించారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంత సాగర్ కాలనీకి చెందిన రవి కుమార్, వేణుగోపాల్, శివశంకర్‌పై కేసు నమోదు చేశామని, అనంతరం 24 గంటల్లోనే కోర్టులో వారిని హాజరుపరిచి 14 రోజుల రిమాండ్‌కు పంపామని సీఐ తెలిపారు.

జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్ వెయిట్‌లిఫ్టింగ్, సాఫ్ట్‌టెన్నీస్ బాల, బాలికల జిల్లా జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17, 19 బాల, బాలికలకు వెయిట్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు శనివారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. డీఎస్‌డీఓ మంజుల పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బాలుర-19లో అమర్, జ్ఞానేశ్వర్, సుధీర్, కుందన్, అభి, చంద్ర ఓబుళరెడ్డి, సుతేంద్రలు ఎంపిక కాగా అండర్-17లో వినయ్, హర్షకుమార్, సోమశంకర్, నితీష్, మను, రాకేష్, సాగర్‌గౌడ్‌లు ఎంపికయ్యారు. అండర్-19 బాలికల్లో పూజ, నిహారిక, సాయి భార్గవి, పల్లవి, హిందూ, భువనచంద్రిక, హైందవి, అలేఖ్య, అండర్-17లో సాత్విక, రమాదేవి, ఇందు, స్రవంతి, మైత్రి, అంజుమ్, పుష్పావతి ఎంపికయ్యారు. సాఫ్ట్‌టెన్నిస్ బాలురలో అండర్-14విభాగంలో జ్ఞానేశ్వర్‌రెడ్డి, హర్షవర్ధన్, అయిదేవ్, రుషి కిరణ్, సాకే హృతికేష్, రాహుల్‌గాంధీ, అండర్-17లో విజ్ఞాన్‌రెడ్డి, దిలీప్‌బాబు ఎంపికయ్యారు. బాలికల అండర్-14విభాగంలో అలియా, సంహిత, కారుణ్య, కావ్య...., అండర్-17లో అరిఫా, అండర్-19లో తనుశ్రీ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి: ఎస్ఈ



మాట్లాడుతున్న ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో పీఆర్, పీఐయూ విభాగంలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు సిబ్బందికి ఆదేశించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమేంటేషన్ యూనిట్) లోని ఈఈలు, డీఈలు, ఏఈలతో శనివారం ఆయన పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. సబ్‌డివిజన్‌ల వారిగా డీఈలతో చర్చించారు. ప్రధానంగా పీఎంజీఎస్‌వై, ఏపీఆర్ఆర్‌పీ, నాబార్డు ద్వారా చేపడుతున్న ప్రాజెక్టుల గురించి ఆరా తీశారు. ఇందులో జిల్లాలో ఏ ఏ పనులు ఏఏ స్టేజ్‌లో ఉన్నాయన్నదానిపై అధికారులతో తెలుసుకున్నారు. సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లా ఈఈ శంకరయ్య, పీపీటూ ఈఈ ఆనంద్, అనంతపురం డీఈ నారాయణస్వామి, తాడిపత్రి డీఈ రాజేశ్వరరెడ్డి, కళ్యాణదుర్గం డీఈ నాగేంద్రకుమార్, ఉరవకొండ డీఈ మధన్‌మోహన్, పుట్టపర్తి డీఈ మధుప్రకాష్‌రెడ్డి, మడకశిర డీఈ వెంకటేష్, కదిరి డీఈ హనుమంతయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచు, టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు

గార్లదిన్నె, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సేవలో అనే పథకాన్ని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని కోటంక సర్పంచ్ మేడాపురం లక్ష్మీ శనివారం గ్రామంలో ఆటోడ్రైవర్లు, టీడీపీ నాయకులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆటో డ్రైవర్లను ఆదుకునేందకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15వేలు చొప్పున అందించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, గోవిందరెడ్డి, అంజి, గోపాల్, నరసింహులు, వీఆర్వో హరికృష్ణ, ఏపీఓ ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు చేయూత హర్షణీయం



బనగానపల్లిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న నటేష్ చౌదరి

అనంతపురం క్రైం, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేసి చేయూతనివ్వడం హర్షణీయమని టీడీపీ బనగానపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి నటేష్ చౌదరి పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా బనగానపల్లిలో శనివారం ఆర్అండ్‌బీ శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటోడ్రైవర్ల ర్యాలీలో అనంతపురం జిల్లాకు చెందిన నటేష్ చౌదరి పాల్గొన్నారు. అక్కడి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లోనే అనేక పథకాలు అమలు చేసిందన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15000 అందిస్తానని సీఎం చంద్రబాబు మాట ఇచ్చారని, చెప్పిన ప్రకారంగానే ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇది ఎంతో హర్షణీయమని పేర్కొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక తపోవనం శివశక్తిసాయి ఆలయంలో శనివారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో రమా సమేత సత్యనారాయణస్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త మణూరు నాగరాజరావు నేతృత్వంలో అర్చకులు రమా సమేత సత్యనారాయణస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తర్వాత ఆలయం వద్ద, ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్,ఆలయ ధర్మకర్త శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు మొబైల్ రిపేరీపై శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు మొబైల్ రిపేరీపై ఈనెల 6వ తేదీనుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. నాణ్యతగల సాంకేతికత, సౌకర్యాలతో మొబైల్ రిపేరీకి సంబంధించి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లలో 45రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణతో పాటు కస్టమర్లతో ఎలా వ్యవహరించాలి, ఇంగ్లీష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం తదితరాలపై కూడా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం టూల్‌కిట్, సర్టిఫికెట్ అందజేస్తామని, వివిధ సంస్థల్లో స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. 18 నుంచి 40 ఏళ్ల లోపు వయసు ఉండి ,ఐదు నుంచి పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో మధ్యాహ్నభోజనం ఉచితంగా అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8885542201, 7780752418లను సంప్రదించాలని సూచించారు.

బొందలవాడలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్



కరపత్రాలను అందజేస్తున్న ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు

నార్పల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బొందలవాడ గ్రామంలో శనివారం సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు ఇంటింటికీ తిరుగుతూ ఇటీవల కేంద్రప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వల్ల ఏ వస్తువులు ఏ మేరకు రేట్లు తగ్గాయో ప్రజలకు కరపత్రాలు పంచుతూ వివరించారు. దీని వల్ల ప్రజలకు ఎంతో ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

అనంతపురం విద్య, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):జిల్లావిద్యాశాఖలో జూనియర్అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఇద్దరికి సీనియర్ అసిసెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. జూనియర్ అసిసెంట్లు ఇలియాజ్, రామాంజనేయులకు ఉద్యోగోన్నతి ఉత్తర్వులను శనివారం డీఈఓ ప్రసాద్‌బాబు అందజేశారు. పలువురు విద్యాశాఖ ఉద్యోగులు వారికి అభినందనలు తెలియజేశారు.

మహాధర్నా వాయిదా

అనంతపురం అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 6న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన మహాధర్నాను వాయిదా వేసినట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ పెద్దల నుంచి ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌కు పిలుపు రావడంతో ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ అవుతుందని భావిస్తున్నామని, అందుకే ధర్నాను వాయిదా వేసినట్లు ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, వికలాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి రాజేష్ తెలిపారు.

ఘనంగా ముగిసిన దస్తగిరిస్వామి ఉరుసు



పవిత్ర కేశాన్ని దర్శించుకుంటున్న ముస్లింలు

అనంతపురం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్‌లోని మాబుసుబహానీ దర్గాలో షాహే గౌసే ఆజం ఆసార్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు గత సెప్టెంబరు 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్న గ్యార్మీ ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు దర్గాలో ఏర్పాటుచేసిన దస్తగిరిస్వామి పవిత్రకేశాన్ని కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు దర్శించుకున్నారు. రాత్రికి పెద్దఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహమ్మద్, కార్యదర్శి నవీద్‌ఖాన్, కోశాధికారి అబ్దుల్ సమి, సభ్యులు పాల్గొన్నారు.

గోదాములు నిరుపయోగం..!

- ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న రైతులు


వజ్రకరూరులో ప్రారంభానికి ఎదురుస్తున్న గోదాము

ఉరవకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వం బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రైతులు పండించుకున్న పంటలను సరైన ధరలకు అమ్ముకునే దాకా నిలువ చేసుకునేందుకు నామమాత్ర రుసుం చెల్లించే విధంగా ప్రణాళికలు తయారుచేశారు. పూర్తి అయిన నిర్మాణాలు ఐదేళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాలేదు. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు 188 గోదాములు మంజూరు కాగా, వాటిలో 138 దాకా పూర్తయ్యాయి. పూర్తయినవి కూడా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. 50 దాకా నిర్మాణాలు ఆగిపోయాయి. ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు, ఉరవకొండ, కూడేరు, విడపనకల్లు మండలాల్లో ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో 8 గోదాములు మంజూరయ్యాయి. ఒక్కో దానికి రూ.46లక్షలు దాకా వెచ్చించి నిర్మించారు. ఉరవకొండలోని జగనన్న


ఉరవకొండలో ఆగిపోయిన నిర్మాణ పనులు

కాలనీలో వెయ్యి మెట్రిక్ టన్నులతో రూ.89లక్షలతో అదనంగా మరో గోదాము మంజూరైంది. వజ్రకరూరు, ఉరవకొండలో నిర్మాణాలు పూర్తి అయినా సొసైటీలకు అప్పగించకపోవడంతో అలంకారప్రాయంగా నిలిచాయి. కొన్ని చోట్ల ఈ గోదాములు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఉరవకొండలో జగనన్న కాలనీలో చేపట్టిన గోదాము నిర్మాణ పనులు ఆగిపోయాయి. నింబగల్లులో చేపట్టిన నిర్మాణ పనులలో నాణ్యత పాటించలేదని అప్పటి ప్రభుత్వంలోని వైసీపీ నాయకులే ఆరోపించారు. నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రస్తుతం ఈ గోదాము గొర్రెల షెడ్‌గా మారింది. కూడేరులో రెండు గోదాములు, విడపనకల్లు మండలంలోని కొత్తకోట, హంచనహాల్ గ్రామాలలో నిర్మాణాలు పూర్తి అయినా వాటిని సొసైటీలకు అప్పగించకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. పండించిన పంటలను ఎక్కడ నిల్వ చేసుకోవాలో తెలియక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా దృష్టిసారించి ఈ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖ డీఈ రఘునాథ్‌ను వివరణ కోరగా డిసెంబర్‌లోపు నిర్మాణ ం పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. పూర్తి అయిన గోదాములను రైతులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

- టీడీపీ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు

గుత్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా నిలిచేందుకు ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని అమలు చేసిందని ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. పట్టణంలో శనివారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 258 మందికి, గ్రామీణ ప్రాంతాల్లో 250 మందికి ఈ పథకం లబ్ధి చేకూరిందని అన్నారు. 516 మంది ఆటో డ్రైవర్లకు రూ.77.40 లక్షలను ఒక్కొక్క డ్రైవర్‌కు రూ.15 వేలు వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. అనంతరం గాంధీ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మీయా, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, మా ర్కెట్ యార్డు చైర్మన్ సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శ్రీనివాసులు, న్యాయవాది సోమశేఖర్, రమేష్, ఇలియాజ్, ప్రసాద్, అబ్దుల్‌వాహబ్, రామకృష్ణ, సునీత, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఉరవకొండ: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని టీడీపీ నాయకులు, అధికారులు ప్రారంభించారు. నియోజకవర్గంలో 808 మందికి రూ.1.21 కోట్లు జమ చేశామని తెలిపారు. ఆటో డ్రైవర్లకు మెగా చెక్కును అదించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు అన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మనోహర్ రెడ్డి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఇన్‌చార్జి ఎంపీడీవో శంకర్, టీడీపీ మండల కన్వీనర్లు వెంకటేశులు, మారయ్య, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, టీడీపీ నాయకులు ప్యారం కేశవానంద, తిమ్మప్ప, నాగేంద్ర, నాగభూషణం, దేవేంద్ర, మురళి, వలి, గోవిందు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

గోకుల్ మిషన్‌ను వినియోగించుకోండి

డీ.హీరేహాళ్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2014లో ప్రారంభించిన గోకుల్‌మిషన్ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ సూచించారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్ కార్యక్రమాన్ని శనివారం గొడిశలపల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. గ్రామంలోని రైతులతో కలిసి పాడి పరిశ్రమకు సంబంధించి లాభదాయ పద్ధతుల గురించి వివరించారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ హనుమంతరెడ్డి, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏడీ నాగలింగేశ్వర్‌రెడ్డి, పశువైద్యాధికారి అమరేశ్వరప్ప పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన ఆలయ స్థలం పరిశీలన

కుందుర్పి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతన వీరభద్రస్వామి ఆలయ స్థలం ఆక్రమణకు గురికావడంతో శనివారం దేవదాయ శాఖాధికారి ఈశ్వరరెడ్డి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆలయ స్థలం ఆక్రమణపై పత్రికలో ప్రచురితం కావడంతో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆ శాఖ రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ఈశ్వరరెడ్డి స్థలాన్ని పరిశీలించి గ్రామస్థులు ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

తాడిపత్రి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ మూడవరోడ్డులో ఉన్న శ్రీవాణి స్మార్ట్ స్కూలులో శనివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తాడిపత్రి ఖండ మహారాణా ప్రతాప్ బస్తీ ప్రముఖ్ సీబీ మధుసూదన్‌రావు మాట్లాడుతూ హిందువులు అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. తల్లిదండ్రులు కుటుంబాన్ని ప్రేమించడం నేర్పిస్తే ఆర్‌ఎస్‌ఎస్ దేశాన్ని ప్రేమించడం నేర్పిస్తుందన్నారు. డాక్టర్ భానుసుజిత్‌రెడ్డి, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి పుట్టా శేషు, ఖండచాలక్ వెంకటరామిరెడ్డి, కత్తి రామచంద్రారెడ్డి, చిరంజీవులు, బీజేపీ నాయకులు జంగంరెడ్డి అంకాల్‌రెడ్డి, ప్రతాప్ ఎరెడ్డి రంగనాథరెడ్డి, వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డుకు మరమ్మతులు

యల్లనూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాల నుంచి కృష్ణాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు శనివారం మరమ్మతు చేశారు. గతనెల 23న ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టండి అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మండలస్థాయి అధికారులతో మాట్లాడి మరమ్మతు చేయాలని ఆదేశించారు. అధికారులు వెంటనే యంత్రాలను ఏర్పాటుచేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి, గుంతలను పూడ్చివేశారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

గుంతకల్లు టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం కసాపురం గ్రామ సమీపంలోని మారుతినగర్‌లో క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువతకు నచ్చిన క్రీడల్లో రాణించి సత్తాచాటాలన్నారు. అనంతరం కొనకొండ్ల, వైటీ చెరువు జట్లు తలపడ్డాయి. వైటీచెరువు జట్టుపై కొనకొండ్ల జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు కసాపురం రమేష్, శ్రీనివాసులు, క్రికెటర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్థులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానిరేవు ప్రాథమికోన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన జోగప్పగారి రవికుమార్ బదిలీపై వెళ్లడంతో గ్రామస్థులు ఆయనను సన్మానించారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు గ్రామంలో బ్యాండ్ సెట్‌తో పూలు చల్లుకుంటూ, భారీ ఎత్తున గ్రామస్థులందరూ ఊరేగించారు. భారీ సభను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడు రవికుమార్ 8 ఏళ్లుగా పనిచేస్తూ, పాఠశాల, విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఇటీవల పదోన్నతిపై గుమ్మఘట్ట మండలం మారెంపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.

మ్యాజిక్ డ్రైన్‌లతో ఎన్నో ఉపయోగాలు


మ్యాజిక్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ

యాడికి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ డ్రైన్‌లతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఉపాధిహామీ పథకం ఏపీడీ పుల్లారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శశికళ తెలిపారు. మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో రూ.74వేలతో ప్రయోగాత్మకంగా ఏర్పాటుచేసిన మ్యాజిక్ డ్రైన్‌ను శనివారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోనే మొదటిసారిగా యాడికి మండలం కోనుప్పలపాడులో మ్యాజిక్ డ్రైన్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దీనివల్ల మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండదన్నారు. ఏపీఓ చిన్నమద్దిలేటి, ఈసీ ఈశ్వర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ బాబాఫకృద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ గాంధీ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు దోపిడీపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక హనుమాన్ సర్కిల్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో దోపిడీపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ హెచ్‌పీ పెట్రోల్ బంకు ఒక లీటర్‌కు 600 మి.లీ పెట్రోల్ మాత్రమే వస్తుందన్నారు. ఈరకంగా పలు పెట్రోల్ బంకులలో దోపిడీతో రోజుకు కొన్ని వేల మంది ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీ చేసి దోపిడీ, అవినీతిపై చర్యలు తీసుకుని పెట్రోల్ బంకులను సీజ్ చేయాలన్నారు. అనంతరం ఏఓకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, సాకే నాగరాజు, రమేష్, రామునాయక్, సూరి, బాషా, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఉపాధి పథకం కింద అభివృద్ధికి ప్రణాళికలు

కూడేరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులపై ప్రణాళికలు సిద్ధం చేశారు. శనివారం చోళసముద్రం, జయపురం గ్రామాల్లో అభివృద్ధిపై సర్పంచు వడ్డే రమాదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 2026-27 ఏడాదిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులను గుర్తించారు. రైతులకు అవసరమైన హార్టికల్చర్, నీటినిల్వ కుంటలు తదితర పనుల ప్రణాళికలను రైతుల సమక్షంలో చర్చించారు. సర్పంచుతోపాటు ఏపీఓ పోలేరయ్య ఉన్నారు.

కుందుర్పి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం గ్రామ సర్పంచ్ మారుతేశ్వరి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి యల్లక్క మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రజలు డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రధాన రహదారులపై మురుగునీరు చేరి ఇబ్బంది పడతున్నారన్నారు. టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


కుందుర్పిలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి యల్లక్క

న్యూస్ బాక్స్

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



బొమ్మనహాళ్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు స్వామి వారి మూలవిరాట్‌కు పూజలు జరిపించారు. ఉదయం పంచామృతాభిషేకం, నిర్మల్యవిసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు జరిపించి పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదానం చేశారు.

వడ్రవన్నూరులో...

రాయదుర్గంరూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయం, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ, ఆకుపూజ, వెండి కవచధారణ చేశారు.

వైభవంగా పల్లకి సేవ


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలను చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు.

దుర్గామాత నిమజ్జనం


అమ్మవారి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంద్రానగర్‌లో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాల అనంతరం దుర్గామాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ఏటిగంగమ్మ కాలువలో నిమజ్జనం చేశారు.

గరుడ వాహనంపై శ్రీవారు



తాడిపత్రి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరిస్వామి ఉరుసు


దస్తగిరిస్వామిని ఊరేగిస్తున్న ముస్లింలు

పెద్దపప్పూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దస్తగిరి స్వామి కట్ట వద్ద శనివారం ఉరుసును ఘనంగా నిర్వహించారు. 15రోజుల నుంచి ఖురాన్ పఠనం చేసి శుక్రవారం ముగించారు. అనంతరం గంధాన్ని ఊరేగించారు. శనివారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మైనార్టీ మండల అధ్యక్షుడు షెక్షావలితోపాటు ముస్లింలు పాల్గొన్నారు.

యల్లనూరు(ఆంధ్రజ్యోతి): స్థానిక దస్తగిరిస్వామి దర్గా వద్ద శనివారం ఉరుసువేడుకలు ఘనంగా నిర్వహించారు. 15 రోజుల ఖురాన్ పఠనం అనంతరం శుక్రవారం రాత్రి గంధాన్ని ఊరేగించారు. శనివారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో హిందూ, ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి

తాడిపత్రి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో టీడీపీ నాయకులు సెల్‌పాయింట్ షాకీర్, హాజీవలి, నజీర్, చోటు, సాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యార్మీ వేడుకల్లో ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలకు గ్యార్మీ పండుగకు ఎంతో పవిత్రత అన్నారు. ప్రతి గ్యార్మీకి అంగరంగ వైభవంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఆయన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

అమరవీరుడు హంపన్నకు ఘన నివాళి


హంపన్న సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

గుత్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళల మాన ప్రాణాలు కాపాడేందుకు పోరాడి అసువులుబాసిన పోరాట వీరుడు హంపన్న సామాధి వద్ద ఆయన వర్ధంతిని శనివారం నిర్వహించారు. ప్రజా సైన్యం వేదిక అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మీయా, జేవీవీ రాష్ట్ర నాయకుడు ఇస్మాయిల్ ఆయన సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, నిజాముద్దీన్, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, జనసేన అశ్వనాగప్ప పాల్గొన్నారు.

రహదారిని బాగుచేయండి

కణేకల్లు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలవడికి-గొడిశలపల్లి గ్రామాలకు ఉన్న రహదారి ప్రమాదకరంగా మారిందని, బాగు చేయాలని జక్కలవడికి గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రహదారిలో ప్రతినిత్యం అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయని, రహదారి అధ్వానంగా మారడంతో వాహనాలు ప్రమాదానికి గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని కోరారు.

ఎస్పీ రాహుల్ మీనాకు ఘన వీడ్కోలు


ఎస్పీ దంపతులను సన్మానిస్తున్న పోలీస్ అధికారులు

గుంతకల్లు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనాకు రైల్వే డివిజన్‌లోని పోలీస్ అధికారులు ఘనంగా విడ్కోలు పలికారు. రాహుల్ మీనా గుంతకల్లు రైల్వే పోలీస్ నుంచి తెలంగాణలోని జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం రాత్రి స్థానిక జీఆర్పీ ఎస్పీ కార్యాయలంలో రాహుల్ మీనాకు పోలీస్ అధికారులు, సన్మానించారు. విధి నిర్వహణలో సహకరించిన సబార్డినేట్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులు విధులకు డుమ్మా

- 11 మందికి గాను ఇద్దరే హాజరు


సచివాలయంలో విధుల్లో ఉన్న ఉద్యోగి

బెళుగుప్ప, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థ కుదుటపడి ప్రజలకు సేవలందించడం ప్రశ్నార్థకంగా మారింది. అడిగేవారు లేరని ఇష్టారాజ్యంగా సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా బెళుగుప్ప సచివాలయం నిలుస్తోంది. సచివాలయంలో 11 మంది విధులు నిర్వహిస్తున్నారు. శనివారం వెల్ఫేర్ అసిస్టెంట్ భార్గవి, వీఆర్వో శ్రావణి మాత్రమే హాజరయ్యారు. ఇద్దరు సెలవుపై వెళ్లారు. సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఇలా వుంటే ఇక గ్రామాల్లోని సచివాలయాల్లో ఏ మేరకు సేవలు అందుతాయో అర్థమవుతుందని ప్రజలు అంటున్నారు.

యువకుడి ఆత్మహత్య


తిమ్మప్పనాయక్(ఫైల్)

గుంతకల్లు టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన రమావత్ తిమ్మప్ప నాయక్(30) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన మేరకు రమావత్ నాయక్‌కు రెండు ఎకరాల పొలం ఉంది. గతంలో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేసి వదిలిపెట్టాడన్నారు. ప్రస్తుతం గ్రామంలో కూలీపనులు, కరెంట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రూ.6లక్షలు అప్పుచేశాడన్నారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు విషయం తెలియజేశారు. అతను అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం లక్ష్మీదేవి 6 నెలల గర్భవతి అన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


ఎస్‌కే తజ్బుల్ (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం కంబదూరు మండలం రాంపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఎస్‌కే తజ్బుల్ (33)తో పాటు మరో ఎనిమిది మంది విద్యుత్ పనులు చేయడానికి 20 రోజుల క్రితం వలస వచ్చారు. ఈ క్రమంలో శనివారం ఎల్‌టీ లెవెన్ కేవీ విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో కిందకు పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో రైలు ప్రయాణికుడు..


మృతిచెందిన ఇస్మాయిల్

గుత్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తూ అనారోగ్యంతో ఓ ప్రయాణికుడు మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన ఇస్మాయిల్ సాహెబ్ (42) అనే ప్రయాణికుడు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగిలో ప్రయాణిస్తున్నాడు. అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. గమనించిన తోటి ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో రైలు గుత్తి స్టేషన్‌కు రాగానే ఆ ప్రయాణికుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చానిపల్లి గ్రామానికి చెందిన రామాంజునేయులు అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామానికి చెందిన రామాంజునేయులు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడని బంధువులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిఉన్న అతడిని బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికత్స కోసం అనంతపురానికి తరలించారు. ఘనటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అధికారులపై తేనె టీగల దాడి

వజ్రకరూరు(ఉరవకొండ), అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగులపాడు లిఫ్ట్ వద్ద రెవెన్యూ అధికారులపై తేనెటీగలు దాడి చేశాయి. కొనకొండ్ల గ్రామానికి చెందిన వ్యవసాయకూలీ రామాంజనేయులు 1వ తేదీన ఛాయాపురం సమీపంలోని హంద్రీనీవా కాలువలో గల్లంతైన విషయం తెల్సిందే. నాలుగు రోజులైనా ఆ వ్యక్తి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కాలువ వెంబడి తహసీల్దారు నరేష్, ఆర్ఐ సతీష్‌లతో పాటు వీఆర్వోలు చత్రునాయక్, రంగస్వామి, వీఆర్ఏలు గాలింపు చర్యలు చేపట్టారు. పంప్‌హౌస్ వద్ద తేనెటీగలు దాడి చేయడంతో ఒక్కసారిగా అధికారులు పరుగులు పెట్టారు. అనంతరం వజ్రకరూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించుకుని తిరిగి కాలువ వెంబడి గాలింపు కొనసాగించారు.

మూడు ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సురేష్, సజ్జలదిన్నె గ్రామానికి చెందిన సుధీర్, అంకన్న ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను సీజ్‌చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

బాలిక కిడ్నాప్‌పై కేసు నమోదు

యాడికి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళుతున్న బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో కృష్ణారెడ్డి అనే వ్యక్తిపై శనివారం కేసులు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. కుందనకోట గ్రామానికి చెందిన బాలిక యాడికిలోని పాఠశాలకు వెళుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన క్రిష్ణారెడ్డి అనే వ్యక్తి కిడ్నాప్ చేసి తీసుకువెళ్లినట్లు తెలిపారు. కసాపురం తీసుకువెళ్లి వివాహం చేసుకున్నట్లు సోషల్‌మీడియాలో ఫొటోలు పెట్టినట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణారెడ్డిపై కిడ్నాప్, పోక్సో కేసు, మైనర్‌ను వివాహం చేసుకున్న కేసులను నమోదు చేశామన్నారు.